# సింగిల్ పేజీ కథ

# జ్ఞానోదయం

“రొయ్యకూ ఉన్నాయి బారెడు మీసాలు. ఎందుకూ కాల్చుకోవడానికా. మూతికి మీసమున్నంత మాత్రాన మొగుడనిపించుకోడు. భార్య కోరికలు గుర్తించి తీర్చగలిగిన వాడే మొగుడు. అలా కానప్పుడు ఆ మొగుడు ఉన్నా నచ్చినా ఒక్కటే” నోటికి అడ్డు అపు లేకుండా అరుస్తూనే ఉంది సుగుణ.

“గట్టిగా అరవకే. నలుగురు విని నవ్వుతారే. పోయేది మన పరువేనే. కాస్త మెల్లగా మాట్లాడవే” బ్రతిమాలుతు న్నాడు శాంతమూర్తి.

భీమరాజు, కనకమ్మల కుమారుడు శాంతమూర్తి. సార్థక నామధేయుడు. చీమకు కూడా హాని తలపెట్టే వాడు కాదు. స్కూలుకెళుతున్న శాంతమూర్తి సైకిల్ తగిలి ఒక కుక్కపిల్ల కాలు విరిగింది. పశువుల డాక్టరు దగ్గరకు తీసుకుపోయి కట్టు కట్టించి తన కారియర్‌లోని అన్న మంతా కుక్కపిల్లకు తినిపించి ఇంటికి తిరిగి వచ్చాడు. దాంతో ఇంట్లోను మరునాడు స్కూలులోను తిట్లు తినాల్సి వచ్చింది. అంతే కాదు. ఆ కుక్కపిల్ల కోలుకునే దాకా తన కారియర్ దానికి పెట్టి తాను పస్తులున్నాడు. తోక ఊపు కుంటూ తన వెంటే స్కూలు గేటు దాకా వచ్చే కుక్కపి ల్లను చూస్తూ ఎంతో సంతోషించేవాడు శాంతమూర్తి. ఇలా ఎన్నో. అందుకే శాంతమూర్తిని ‘దీనబంధు’ అనేవారు. ఎప్పుడైనా కోపమొచ్చినా తనలోనే బాధపడే వాడే కానీ ఇత రుల మనసు నొప్పించే వాడు కాదు.

పంటలు సరిగా పండకపోయినా అప్పు చేసి కొడు కును చదివించాడు భీమరాజు. “మావోడు గదేదో పెద్ద సదువు సదూతుంటాడు” అంటూ మీసం మెలేస్తూ గర్వంగా చెప్పుకునేవాడు. శాంతమూర్తి బి.ఏ. పాసైన నాడు భీమరాజు ఆనందానికి అంతే లేకపోయింది.

“చూడు భీమరాజూ! నీ కొడుకు చాలా తెలివైనవాడు. బి.ఇడికి పంపించు. మీ వాడు తప్పక టీచరవుతాడయ్యా” భీమరాజు మనసులో నిలబడిపోయాయి స్కూలు మాస్టారి మాటలు.

చిన్నప్పుడు పొలానికెళ్తూ స్కూలు దగ్గరకి వచ్చేసరికి ఆగిపోయే వాడు భీమరాజు. మాస్టారు చెప్పే పాఠం వింటూ నిలుచుండిపోయేవాడు. పొలానికి ఆలస్యంగా వెళ్లి ఎన్నోసార్లు తండ్రితో దెబ్బలు కూడా తిన్నాడు. ఇప్పుడు మాస్టారు మాటలు విన్నాక “నా కొడుకును మాష్టారుగా సూడాల్సిందే” గట్టిగా నిర్ణయించుకున్నాడు భీమరాజు.

“చదివింది చాలులే నాన్నా. ఏదో చిన్న ఉద్యోగం చూసుకుంటా. అప్పులు తీరాలి కదా. నీవైనా ఎన్నాళ్లని కష్టపడతావు” దిగు లుగా పలికాడు శాంతమూర్తి.

“నీవలాగనమాకురా అయ్యా. నా కట్టానిదేముందిలే. గదేదో బీడిసదు వంట. దాంతో నీకు మాట్టారు వుజ్జోగం నికార్సుగా వత్తాదంటయ్యా. నీవేమీ ఆలో సించమాక. పైసల కోసం దిగులు పడ మాక. నాన్జూసుకుంటాగా” మొండికే శాడు భీమరాజు. తండ్రి కోరిక కాదనలేక అయిష్టంగానే ఎడ్‌సెట్ రాసి సీటు సంపాదించాడు శాంతమూర్తి.

“ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమీడియట్లీ” టెల్గ్రాం అందుకొని కుప్పకూలిపోయాడు శాంతమూర్తి.

“చేనుకెళుతుంటే బండి తిరగబడింది. బరువంతా మీద పడటంతో ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయి. ఒకటి రెండు రోజులకు మించి బతకడం కష్టం” ఊరు చేరాక తెలిసిన విషయమది.

“అయ్యా శాంతన్నా నీవు దిగులు పడమాక. అమ్మను బాగా సూసుకో. నాదో సిన్న కోరికరా అయ్యా. మీ మేనత్త అదే నా సెల్లెలు వుత్త తిక్కబాగుల్ది. మీయమ్మ నోటికి జడిసి మనింటికి రావడమే తగ్గించేసినాది. దాని బిడ్డ సుగుణ నీకు తెలుసు కదా. మీయమ్మనెలా ఒప్పిస్తావో మరి. నీవు మాత్రం దాన్ని మనువాడాలా అయ్యా. నీ నెత్తిన నాలుగు గింజలేసే అదురుట్టం ఆ బగమంతుడు నాకివ్వాలా. వెళ్తున్నానయ్యా. నా కోరిక తీరుత్తావు కదా” అంటూ కొడుకు చేతుల్లోనే ప్రాణం వదిలాడు భీమరాజు.

బి.ఎడ్. పూర్తి చేశాడు శాంతమూర్తి. సుగుణను చేసు కోవడానికి ససేమిరా వీల్లేదంది కనకమ్మ. “నాన్న జీవి తంలో ఏనాడు సుఖపడింది లేదు. బ్రతుకంతా మన సుఖం కోసమే గడిపాడు. ఆయన చివరి కోర్కెనైనా తీర్చి నాన్న ఆత్మకు శాంతిని కలిగించడం కొడుకుగా నా ధర్మ మమ్మా. నీకిష్టమున్నా లేకపోయినా నాన్న కోసమైనా నీవు రాజీ పడక తప్పదు” తల్లిని వేడుకున్నాడు శాంతమూర్తి. విధి లేక తల ఊపింది కనకమ్మ.

అదృష్టం కలిసొస్తే నడచి వచ్చే బిడ్డ పుడతాడంటారు. సుగుణ ఇంట్లో అడుగు పెట్టడం, శాంతమూర్తి డి.ఎస్సీ. పరీక్షలు రాయడం, టీచర్‌గా సెలెక్టు కావడం కూడా జరి గింది. “నీవు అదృష్టవంతురాలివి కనకమ్మా. కోడలు పిల్ల నీ ఇంట్లో కాలుపెట్టిందో లేదో నీ కొడుకు టీచరయ్యాడు” ఇరుగుపొరుగువారి మాటలతో కనకమ్మ మనసు మారిపో యింది.

“సుగుణా మీ మావయ్య కడసారి కోరిక కాదనలేక నిన్నీ ఇంటికి కోడలిగా తెచ్చుకున్నానమ్మా. నీవొచ్చాక మావాడు టీచరయ్యిండు. నీవే మా ఇంటి మాలచ్చిమని తెలుసుకున్నా. ఆడకూతురు లేని నాను నిన్ను కోడలిగా కాదు కూతురిగా సూసుకుంటానమ్మా. నాదేముంది. ఓ ముద్ద పడేస్తే రామా క్రిష్ణా అనుకుంటూ కాలం గడిపేత్తా. శాంతన్న నోట్లో నాలిక లేనోడు. అన్ని నీ సేతుల పెడ తుండా. అంతా నీ ఇట్టం. సల్లగా సిలకాగోరింకల్లా బత కండి” మనసారా ఆశీర్వదించింది కనకమ్మ.

ఇంట్లో పనంతా కనకమ్మే చేసేది. మొదట్లో బాగున్నా రానురాను టీవీ సీరియల్స్ ప్రభావం, ఇరుగుపొరుగు అమ్మలక్కల మాటలు సుగుణపై పనిచేయసాగాయి. పక్కవాళ్లతో తనను పోల్చుకోవడం మొదలెట్టింది.

“పేరుకు మాత్రం ఉద్యోగస్తురాని భార్యనే. కానీ ఏం సుఖపడుతున్నానని. నగలా, సినిమాలా, షికార్లా. ఏ ముచ్చట లేదాయె. తిండి మాత్రముంటే సరిపోతుందా” అనుకోసాగింది సుగుణ.

బాత్‌రూంలో కాలుజారి పడిన కనకమ్మ మంచమె క్కింది. వంటపని ఇంటి పని అదనంగా అత్తగారికి సేవలు. “అక్క సీరియల్‌లో కల్పన పరిస్థితి ఏమయిందో. నిన్నే పెళ్లాడుతాలో నీరజ ఏమయిందో, టీవీ చూడడానికే కుద రడం లేదు. ఏం బతుకో. గానుగెద్దు జీవితం” తన అసం తృప్తిని భర్తపై చూపించేది సుగుణ.

“మేనమామ కొడుకని మోజు పడి చేసుకున్నందుకు అనుభవించాల్సిందే మరి. ఏ కూలివాన్ని చేసుకున్నా హాయిగా సుఖపడేదాన్ని. ఏమడిగినా సర్దుకోమంటారు. తల్లికేమో ఠంచనుగా మందులు కొనాల్సిందే. అక్కడ మాత్రం ఏ లోటూ రాకూడదు” లేచినప్పటి నుంచి ఇదే సుప్రభాతమయింది శాంతమూర్తికి.

సున్నిత మనస్కురాలు కనకమ్మ. “నా మూలంగా నా కొడుకు మాటలు పడరాదు. నేను బతికి మాత్రం సాధించే దేముంది. నా బతుకుని ముగించాలి” నిర్ణయించుకుంది కనకమ్మ. మందులతోపాటు ఆహారం తీసుకోవడం మానే సింది. “శాంతన్నా సుగుణతో తగాదా పడమాకు. సర్దుకు పోతేనే సంసారం” ఇవే కనకమ్మ చివరి మాటలయ్యాయి.

ఇప్పుడు సుగుణ స్వేచ్ఛా జీవి. ఆడంబరాలతో పాటు అప్పులు పెరిగాయి. రానురాను సాధింపులు, వేధింపులు ఎక్కువయ్యాయి. ఇంటికి రావాలంటేనే భయపడుతు న్నాడు శాంతమూర్తి. “అకారణంగా భార్యతో ఇలా తిట్లు తినేదానికన్నా ఈ జీవితాన్ని చాలిస్తే” ఎన్నోసార్లు ఇలాంటి ఆలోచన చేశాడు.

“ఆగు. ఆత్మహత్య మహాపాపమని నీకు తెలియదా. కష్టాలకు ఎదురు నిలిచి పోరాడాలి కానీ ఓడిపోయి జీవి తాన్ని ముగిస్తావా. ఇది పిరికితనం. ఇంతకూ నీకొచ్చిన కష్ట మేమిటి” ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోబోతున్న శాంత మూర్తిని వారించాడు ఆ దారిన వెళుతున్న ఒక సాధువు. తన కథనంతా పూసగుచ్చినట్లు వివరించాడు శాంత మూర్తి. “ఇప్పుడు చెప్పింది నేను బతికి ఎవరినుద్ధరిం చాలి” బోరున విలపించాడు.

“నీ బాధ అర్థమయింది బాబూ. ఇక్కడే నీవు పొరబ డుతున్నావు. ఏ జీవైనా పూర్వజన్మలో చేసిన పాపాల ఫలి తాన్ని ఈ జన్మలో అనుభవించక తప్పదు. ఈ జన్మలో

